క్లుప్తంగా

రాజన్న సేవలో ఏఐసీసీ అబ్జర్వర్



వేములవాడ: వేములవాడ రాజన్నను ఏఐసీసీ అబ్జర్వర్ శ్రీనివాస్ వీ మన్నే ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి శుక్రవారం దర్శించుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, అధికారులు వారికి ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించి అనంతరం వేదోక్త ఆశీర్వచనం గావించారు.

అల్లు అర్జున్‌కు రాజన్న ప్రసాదం

సినీ నటుడు అల్లు అర్జున్‌కు వేములవాడకు చెందిన శీలం విజయ్‌యాదవ్ శుక్రవారం హైదరాబాద్‌లో కలిసి వేములవాడ రాజన్న ప్రసాదం అందజేశారు. అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా శీలం విజయ్ యాదవ్‌ను నియమించినట్లు అల్లు అర్జున్ తెలిపారు. నియామకానికి సహరించిన నిర్మాత బన్నీ వాసు, శరత్, సందీప్, రాష్ట్ర అధ్యక్షుడు అంజికి విజయ్‌యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు.

బీసీ రిజర్వేషన్లపై బీజేపీ నాటకం



మాట్లాడుతున్న మూశం రమేశ్

సిరిసిల్లటౌన్: బీసీల రిజర్వేషన్లపై బీజేపీ నాటకాలు ఆడుతోందని సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేశ్ విమర్శించారు. సిరిసిల్లలోని పార్టీ ఆఫీస్‌లో శుక్రవారం ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. రాష్ట్రంలో బీసీల రిజర్వేషన్ల సాధనకు మద్దతు ఇస్తూ కేంద్రంలో అడ్డుకుంటున్న బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా బీసీ సంఘాలు పోరాటం చేస్తేనే తాము మద్దతుగా నిలుస్తామన్నారు. లేకుంటే స్వతంత్రంగా పోరాటం చేస్తామని పేర్కొన్నారు. సీపీఎం కార్యదర్శి వర్గ సభ్యులు ఎల్లారెడ్డి, కోడం రమణ పాల్గొన్నారు.

వివాహ వేడుకలో కేటీఆర్

గంభీరావుపేట : మండలకేంద్రంలో శుక్రవారం జరిగిన బీఆర్‌ఎస్ నాయకుడు కరువారి శంకర్ కూతురు వివాహానికి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట నాఫ్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్ రావు, నాయకులు నారాయణరావు, కొమిరిశెట్టి లక్ష్మణ్, వెంకటి యాదవ్, రాజరామ్ తదితరులు పాల్గొన్నారు.

అర్బన్ బ్యాంక్ ఎదుట నిరసన


సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రంలోని సిరిసిల్ల సహకార అర్బన్ బ్యాంకులో ఉద్యోగాల నియామకానికి కొత్తగా ఇచ్చిన నోటిఫికేషన్‌పై పౌర సంక్షేమ సమితి అభ్యంతరం తెలిపింది. ఈ మేరకు సమితి అధ్యక్షుడు బియ్యంకార్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సభ్యులు శుక్రవారం బ్యాంకు ఎదుట నిరసన తెలిపారు. ఇప్పటికే బ్యాంకులో సుమారు 12 మంది ఉద్యోగులు పనిచేస్తుండగా అదనంగా 8 పోస్టులకు కొత్తగా నోటిఫికేషన్ జారీచేశారన్నారు. ఉన్న ఉద్యోగులకే అంతంత పని ఉందని, కొత్త ఉద్యోగ నియామకాలు జరపడంతో బ్యాంకుకు జీతాల భారంతో అధికమవుతుందన్నారు. గతంలో గుట్టుచప్పుడు కాకుండా కొంతమందిని తీసుకొని వారిని పర్మినెంట్ చేశారని ఆరోపించారు. సమితి ఉపాధ్యక్షుడు చీకోటి అనిల్‌కుమార్, సహాయ కార్యదర్శి కుసుమ గణేశ్, శ్రీరాములు సత్యనారాయణ, బోడ శ్రీనివాస్, మడికొండ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నియామకపత్రం అందజేత



ఎల్లారెడ్డిపేట: సెస్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నామని డైరెక్టర్ వరస కృష్ణహరి అన్నారు. రాచర్ల గొల్లపల్లికి చెందిన సెస్ ఉద్యోగి ఇటీవల మృతిచెందగా, అతని కుమారుడు ముఖేశ్‌యాదవ్‌కు కారుణ్య నియామకం ద్వారా జూనియర్ అసిస్టెంట్‌గా నియమిస్తూ నియామకపత్రం అందజేశారు. డైరెక్టర్ మాట్లాడుతూ సెస్ అధికారులు, ఉద్యోగులు అంకితభావంతో పనిచేసి విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. సెస్ ఏఈ, లైన్‌మెన్లు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

బోయినపల్లి: స్థానిక సంస్థల ఎన్నికల్లో ముగ్గురు పిల్లల నిబంధనను ప్రభుత్వం ఎత్తివేసినందుకు హర్షవ్యక్తం చేస్తూ మండలకేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చిత్రపటాలకు శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. ఏఎంసీ చైర్మన్ ఎల్లేశ్‌యాదవ్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఏనుగుల కనుకయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, నాయకులు తదితరులు ఉన్నారు.

ప్రయాణం.. ప్రాణసంకటం



మల్యాల గ్రామ శివారులో రక్షణ గోడ లేని కల్వర్టు



ఆశిరెడ్డిపల్లె శివారులో ప్రమాదకరంగా మూలమలుపు

- మండలంలో డేంజర్‌గా పలు రహదారులు, కల్వర్టులు
- మూలమలుపుల వద్ద నిత్యం ప్రమాదాలు
- పలుసార్లు విన్నవించినా పట్టించుకోని అధికారులు

చందుర్తి: మండలంలోని పలు రహదారులపై ప్రమాదకర ప్రాంతాల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రయాణికులు ప్రమాదాలబారిన పడుతున్నారు. చందుర్తి మండలం మూడపల్లి నుంచి లింగంపేట వరకు సుమారు 17 కిలోమీటర్లు ఉండగా నిత్యం ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. తరుచూ ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను డేంజర్ జోన్లుగా గుర్తించి బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రయాణికుల విజ్ఞప్తి చేసినా అధికారులు స్పందించడం లేదు. రెండేళ్లుగా ఈ రోడ్డుపై 10 మందిపైగా మృతిచెందగా, 50 మందికి పైగా తీవ్రగాయాలయ్యాయి.

అధికారుల నిర్లక్ష్యం

వేములవాడ – కోరుట్ల ప్రధాన రహదారైన మూడపల్లి– లింగంపేట వరకు, మర్రిగడ్డ నుంచి జోగాపూర్, కిష్టంపేట, రామరావుపల్లె, సనుగుల వరకు, మూడపల్లి నుంచి అనంతపల్లి, నర్సింగాపూర్, ఆశిరెడ్డిపల్లె, తిమ్మాపూర్, రామన్నపేట, చందుర్తి వరకు, హన్మాజీపేట నుంచి ఎన్గల్, బండపల్లి వరకు, నాలుగు రోడ్లు ఉన్నాయి. అధికారులు ఒక్క రహదారిపైన సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన బోర్డులు వర్షాలకు తడిసి తుప్పు పట్టిపోయాయి. దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులకు రోడ్లపై ఎక్కడ ఏముందో తెలియక ప్రమాదాల బారినపడుతున్నారు. రోడ్డు పక్కనే పాఠశాలలు ఉన్నా సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. కనీసం స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన వారు స్పందించడం లేదన్న విమర్శలున్నాయి.

మూల మలుపులు వద్ద ఇదే దుస్థితి

మండలంలోని మూడపల్లి నుంచి లింగంపేట వరకు పదహారుకు పైగా మూలమలుపులున్నాయి. ఏఒక్క మూలమలుపు వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. దీంతో తరుచూ మూలమలుపుల వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయి. మూడపల్లి ఎక్స్‌రోడ్డు నుంచి రామన్నపేట వరకు, మర్రిగడ్డ ఎక్స్‌రోడ్డు నుంచి సనుగుల వరకు, హన్మాజీపేట ఎక్స్‌రోడ్డు నుంచి ఎన్గల్, బండపల్లి, బావుసాయిపేట వరకు మూలమలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో కొన్ని మూలమలుపులు దగ్గరకు వచ్చేంతవరకు కనిపించడం లేదు. దీంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

సూచికలు ఏర్పాటు చేయాలి



వేములవాడ– కోరుట్ల ప్రధాన రహదారి మధ్యలోని మూడపల్లి బస్టాండ్ వద్ద మూలమలుపు ప్రమాదకరంగా ఉంది. కొన్ని నెలలుగా ప్రమాదాలు జరుగుతున్నా కనీసం సూచిక బోర్డును ఏర్పాటు చేయడంలో అధికారుల నిర్లక్ష్యం వహిస్తున్నారు.

– లింగంపల్లి బాబు, బండపల్లి

రక్షణ గోడలు నిర్మించాలి



ప్రధాన రహదారి వెంట నిర్మించిన కల్వర్టులను వంకరగా నిర్మించారు. దీంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కల్వర్టులకు ఇరువైపులా రక్షణ గోడలు కూలిపోయాయి. మల్యాలలో కల్వర్టు వద్ద రోడ్డు ఎత్తువంపులుగా ఉండడంతో వాహనాలు అదుపు తప్పుతున్నాయి.

– పడిగెల శ్రీనివాస్, మల్యాల

ప్రతిపాదనలు పంపాం

మూలమలుపులు, ముఖ్య కూడళ్లు, పాఠశాలల గేట్ల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపించాం. ప్రమాదకర మలుపులు, రోడ్డు పక్కన బావులు, తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి కంచెలు ఏర్పాటు చేశారు. పోలీసులు, తాము గుర్తించిన ప్రాంతాల్లో బోర్డులను సేఫ్టీ వాల్స్‌ను ఏర్పాటు చేయిస్తాం.

– శాంతయ్య, ఆర్‌అండ్‌బీ డీఈ

‘జస్టిస్ గవాయ్‌పై దాడి సరికాదు’



సిరిసిల్ల టౌన్ : తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



ఇల్లంతకుంట: తహసీల్దార్ కార్యాలయం వద్ద వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సిరిసిల్లటౌన్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై దాడి అమానుషమని ఎమ్మార్పీఎస్ నేతలు అన్నారు. దాడిని నిరసిస్తూ శుక్రవారం సిరిసిల్ల తహసీల్దార్ ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. వక్తలు మాట్లాడుతూ అత్యున్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తిపై దాడి సరికాదన్నారు. ఎమ్మార్పీఎస్ సిరిసిల్ల టౌన్ అధ్యక్షుడు బడుగు లింగయ్య, రాష్ట్ర నాయకులు ఆవునూరి ప్రభాకర్, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఖానాపురం లక్ష్మణ్, జిల్లా అధికార ప్రతినిధి గుండ్రెడ్డి రాజు, రాకేష్, శోభారాణి, ఆవునూరి లచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు..

ఎల్లారెడ్డిపేట: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి సరికాదని ఎమ్మార్పీఎస్ జిల్లా బాధ్యులు ఖానాపురం లక్ష్మణ్ అన్నారు. ఎల్లారెడ్డిపేట తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు.

ఇల్లంతకుంట: మండల ఎమ్మార్పీఎస్ నాయకులు తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మంద రాజు, మాల మహానాడు కార్యదర్శి బాబు, గడ్డం సింహాద్రి, రామంచ మధు, తదితరులు పాల్గొన్నారు.

రుద్రంగి: ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు దయ్యాల నారాయణ ఆధ్వర్యంలో మండలకేంద్రంలో అఖిలపక్షం నాయకులు నిరసన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ పుష్పలతకు వినతిపత్రం అందించారు. మాజీ జెడ్పీటీసీ గట్ల మీనయ్య, ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షుడు తర్రె లింగం, కాంగ్రెస్ మండల బీసీ సెల్ అధ్యక్షుడు గండి నారాయణ, నాయకులు ఉన్నారు.

బోయినపల్లి: మండల ఎమ్మార్పీఎస్ నాయకులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపిన అనంతరం తహసీల్దార్ కాలె నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్, వీహెచ్‌పీఎస్ జిల్లా కో కన్వీనర్ కే. రవీందర్, మండల అధ్యక్షుడు కే. రమేశ్, వీపీ. ఇల్లందుల రాజు, వీహెచ్‌పీఎస్ మండల అధ్యక్షుడు అక్కనపల్లి పర్శరాములు, దేవయ్య, తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: ముస్తాబాద్ నాయబ్ తహసీల్దార్‌కు ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కొమ్మెట రాజు వినతిపత్రం అందజేశారు. సుంచు మల్లయ్య, సడిమెల శోభరాణి, నర్సింలు తదితరులున్నారు.

కోనరావుపేట: కోనరావుపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ నాయకులు నల్ల జెండాలతో నిరసన చేపట్టారు. మండల ఎమ్మార్పీఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గద్దరాశి భగవంతం మాదిగ ఆధ్వర్యంలో తహసీల్దార్ ముక్తర్‌పాషాకు వినతిపత్రం అందించారు. నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఎంఎస్పీ మండల అధ్యక్షుడు వడ్లూరి రాజం మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

బీసీల బంద్‌కు మద్దతు

సిరిసిల్ల: కేంద్రంలోని బీజేపీ సర్కారు మొదటి నుంచి రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ఉందని ప్రజాసంఘాల ఉమ్మడి వేదిక స్పష్టం చేసింది. దేశంలో బీజేపీ ప్రభుత్వం ఇప్పటికీ కులగణన జరపకుండా రిజర్వేషన్లను బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు దక్కకుండా అడ్డుపడుతుందని పేర్కొంది. 2023లో జరిగిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ బీసీలకు ఇచ్చిన హామీలో 42శాతం రిజర్వేషన్లను ప్రవేశపెట్టిందని, తక్షణమే బీసీల 42శాతం బిల్లును షెడ్యూల్ 9లో చేర్చి చట్టబద్ధత కల్పించాలని తెలిపింది. ప్రజా సంఘాల ఉమ్మడి వేదిక సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని ప్రజా సంఘాల ఉమ్మడి వేదిక ప్రతినిధులు వంగల సంతోష్, విమలక్క, ఏపూరి మల్సూర్, పోతుల రమేశ్, వై.మల్లేశ్, టి.అంజయ్య, నాగిరెడ్డి, ఆర్.బాబురావు, అల్లూరి విజయ్, సామ అనుసూర్య, లక్ష్మి, ప్రకటించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



నందన్‌సాయిని అభినందిస్తున్న కృష్ణకర్‌రెడ్డి

సిరిసిల్లటౌన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఆర్చరీ విభాగంలో భారతీ విద్యానిలయం విద్యార్థి వంకాయల నందన్ సాయి అండర్ 14 రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల పెద్దపల్లిలో జరిగిన జిల్లా స్థాయి ఆర్చరీ విభాగంలో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ప్రిన్సిపాల్ కృష్ణకర్ రెడ్డి, కరస్పాండెంట్ రాంరెడ్డి, బాలకృష్ణ, ఉపాధ్యాయులు అభినందించారు.

- **సీపీఆర్‌పై అవగాహన**



సిరిసిల్లటౌన్: రాష్ట్ర ప్రభుత్వం, జాతీయ ఆరోగ్య మిషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న సీపీఆర్ వారోత్సవాలను శుక్రవారం సిరిసిల్లలో నిర్వహించారు. 108 సిబ్బంది బతుకమ్మ ఘాట్ వద్ద వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులకు అవగాహన కల్పించారు. గుండెపోటు వచ్చినప్పుడు చేయాల్సిన సీపీఆర్ గురించి విద్యార్థులకు వివరించారు. 108 సిబ్బంది పెద్ది శ్రీనివాస్, జలగం సత్యసాగర్, వర్దాల అనిల్ కుమార్, మొగిలి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

- **రేపు ఉచిత వైద్య శిబిరం**

వేములవాడ: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో వేములవాడలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో సన్‌రైజర్స్ కరీంనగర్ ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్‌క్లబ్ ప్రతినిధులు డాక్టర్ నాగమల్ల శ్రీనివాస్, డాక్టర్ చీకోటి సంతోష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత వైద్యశిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

- **బీసీ బంద్‌ను విజయవంతం చేయాలి**

చందుర్తి : బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ శనివారం తలపెట్టనున్న తెలంగాణ బంద్‌ను మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ నాయకులు పిలుపునిచ్చారు. ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పిస్తూ జీవో ఇచ్చి దాదాపు 2.5కోట్ల బీసీలను మభ్య పెడుతున్నారన్నారు. ప్రధాని మోదీ బీసీ అని చెప్పడం తప్ప బీసీల రిజర్వేషన్ల కోసం చేసిందని శూన్యమన్నారు. అన్ని గ్రామాల్లో హోటళ్లు, కిరాణ దుకాణాలు, పెట్రోలు, బంక్‌లు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను మూసివేయాలని కోరారు.బంద్‌కు మాలమహానాడు జిల్లా నాయకులు నీరటి శ్రీనివాస్ సంపూర్ణ బంద్‌కు సహకారం అందిస్తామన్నారు.

సంక్షిప్త వార్తలు

- **చట్టాలపై అవగాహన**

వేములవాడ అర్బన్ : బాలికల సంరక్షణ కోసం ప్రభుత్వం కఠిన చట్టాలను తీసుకొచ్చిందని, వాటిపై అవగాహన ఉండాలని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ కాటన్ అంజయ్య కోరారు. పట్టణంలోని కేజీబీవీ పాఠశాలలో మహిళా శిశుసంక్షేమ, చైల్డ్ హెల్ప్‌లైన్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. చైల్డ్ వెల్ఫేర్ అధికారి కవిత మాట్లాడుతూ బాల్య వివాహాలు, బాల కార్మికులు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ వంటి అంశాలపై వివరించారు. పాఠశాల బోధన సిబ్బంది, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

- **కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి**

తంగళ్లపల్లి: చివరిగింజ వరకు ధాన్యం కొనుగోలు చేస్తామని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వెలుముల స్వరూప తిరుపతి రెడ్డి అన్నారు. మండలంలోని తాడూరు, గోపాల్‌రావుపల్లి, పాపాయిపల్లి, లక్ష్మీపూర్, చీర్లవంచలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ప్రారంభించారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌నేరెళ్ల నర్సింగం, కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

- **ఉపాధి పనుల గుర్తింపు**

ఎల్లారెడ్డిపేట: మండలంలోని పదిరలో ఉపాధిహామీ గ్రామసభను ఎంపీవో జోగం రాజు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. 2025–26లో చేపట్టాలిన్న పనులను గుర్తించామన్నారు. కూలీలందరికీ ఉపాధి కల్పించడమే లక్ష్యంగా పనులు గుర్తించామన్నారు. సమావేశంలో టీఏ రాజు, ప్రభాకర్, కార్యదర్శి సారిక, జీపీవో వినోద, శ్రీనివాస్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

- **నేడు గంజాయి నిర్మూలనపై అవగాహన**

వీర్నపల్లి: గంజాయి వ్యసనాన్ని నిర్మూలించాలనే లక్ష్యంతో ధూమా నాయక్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు నార్కొటిక్స్ ఎస్పీ భూక్యా రాంరెడ్డి తెలిపారు. గర్జనపల్లి పాఠశాల వెనక సీతారామ్ నాయక్ తండా ధూమా నాయక్ స్మారక విగ్రహం వద్ద కార్యక్రమం జరుగుతుందన్నారు.

- **హార్వెస్టర్ యజమానులతో సమావేశం**

బోయినపల్లి: మండలంలోని హార్వెస్టర్ యజమానులతో శుక్రవారం తహసీల్దార్ కాలె నారాయణరెడ్డి, ఎస్సై రమాకాంత్, ఎంఏవో ప్రణీత, వాహన తనిఖీ అధికారి రజని ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. వరి కోతల అనంతరం వెంటనే తూర్పార పట్టాలని దీంతో తాలు రాదని తెలిపారు. రైతులను ఇబ్బందులకు గురిచేయవద్దని సూచించారు. పలువురు హార్వెస్టర్ యజమానులు ఉన్నారు.

- **రైతుబజార్ షెడ్ కూల్చివేత**

ఇల్లంతకుంట: మండలకేంద్రంలోని రైతు బజార్ షెడ్డును శుక్రవారం గ్రామపంచాయతీ అధికారులు కూల్చివేశారు. ఇల్లంతకుంట బస్టాండ్ ఆవరణలో టాయిలెట్స్ లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే రూ.3లక్షలు మంజూరు చేశారు. గ్రామ పంచాయతీ రూ.90 వేలు సమకూర్చాల్సి ఉండగా, రూ.2లక్షల 10 వేలు స్వచ్ఛభారత్ మిషన్ కింద మంజూరు కానున్నాయని ఎంపీడీవో శశికళ తెలిపారు.

బంద్‌ను విజయవంతం చేయాలి



ఎల్లారెడ్డిపేట: అభివాదం తెలుపుతున్న బీసీ సంఘాల నాయకులు



తంగళ్లపల్లి: నినాదాలు చేస్తున్న బీసీ సంఘం నాయకులు

కోనరావుపేట: స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ రాజ్యసభ సభ్యులు బీసీ సంఘాల జేఏసీ కన్వీనర్ ఆర్.కృష్ణయ్య 18న రాష్ట్రవ్యాప్త బంద్‌కు పిలుపునిచ్చింది. బంద్‌కు బీసీ కులసంఘాలు, వివిధ రాజకీయ పార్టీలు సంపూర్ణ మద్దతు ఇచ్చి బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ జిల్లా కార్యదర్శి నూనె మల్లేశ్‌యాదవ్ కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న నిర్లక్ష్య ధోరణి, ద్వంద్వ వైఖరిని నిరసిస్తూ అన్ని బీసీ కులసంఘాల ఆధ్వర్యంలో తలపెట్టిన రాష్ట్ర బంద్ను అన్ని బీసీ కుల వర్గాలు విజయవంతం చేయాలన్నారు.

కాంగ్రెస్ మద్దతు

రాష్ట్ర బంద్‌కు కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతు ఉంటుందని కోనరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా అన్నారు. కోనరావుపేటలో శుక్రవారం మాట్లాడారు.

గంభీరావుపేట: మండలంలో బీసీ సంఘాల రిజర్వేషన్ల కోసం శనివారం చేపట్టనున్న బంద్‌ను విజయవంతం చేయాలని మండల యువజన కాంగ్రెస్ నాయకులు కోరారు. అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ఇవ్వాలని కోరారు.

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలో బీసీ సంఘాల జేఏసీ నాయకుల సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ 42 శాతం రిజర్వేషన్ల సాధనకు ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలన్నారు. జేఏసీ కన్వీనర్ బండారి బాల్‌రెడ్డి, కంచర్ల రాజు, దేవేందర్, కైలాసం, కల్యాణ్, కిషన్, నర్సింలు, శ్రీనివాస్, నర్సయ్య, మహేందర్, భూపతి, రమేశ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

లంబాడా హక్కుల పోరాట సమితి మద్దతు

ఈనెల 18 బీసీ సంఘాల జేఏసీ ఇచ్చిన బంద్‌కు లంబాడా హక్కుల పోరాట సమితి మద్దతు ఇస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు భూక్య గజన్‌లాల్‌నాయక్ పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేటలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. బీసీ సంఘాల బంద్‌లో లంబాడా హక్కుల పోరాట సమితి నాయకులు సైతం పాల్గొని మద్దతు తెలపాలని కోరారు.

బంద్‌కు సహకరించండి

ఇల్లంతకుంట : స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం తలపెట్టిన బీసీ బంద్‌కు అందరూ సహకరించాలని ఇల్లంతకుంట మండల బీసీ యూత్ ప్రెసిడెంట్ కోల సంతోష్ గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. వ్యాపార వేత్తలు, విద్యాసంస్థలు, బీసీ నాయకులు, ప్రజలు, అందరూ పూర్తి మద్దతు తెలపాలని ఆయన పేర్కొన్నారు.

తంగళ్లపల్లి: రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలని బీసీ సంఘం నాయకులు అన్నారు. మండలకేంద్రంలోని మార్కండేయ దేవస్థానంలో సమావేశం జరిగింది. 42శాతం బీసీ రిజర్వేషన్ వచ్చే వరకు పోరాటం చేస్తామన్నారు. బీసీ నాయకులు గజభీంకార్ రాజన్న, మచ్చ శ్రీనివాస్, ఎగుర్ల కర్ణాకర్, కోల ఆంజనేయులు, ఎగుర్ల ప్రశాంత్, కందుకూరి రామ గౌడ్, అనిల్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించడం కోసం నిర్వహించే రాష్ట్ర బంద్‌కు అన్నివర్గాల వారు మద్దతు తెలపాలని సీపీఐఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మల్లారపు అరుణ్‌కుమార్ అన్నారు.

ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి



చందుర్తిలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యులు

చందుర్తి(వేములవాడ): ధాన్యం కొనుగోళ్లను వెంటనే ప్రారంభించాలని బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యులు పొంచెట్టి రాకేశ్ డిమాండ్ చేశారు. చందుర్తిలో ఆరబెట్టిన వరి ధాన్యాన్ని శుక్రవారం పరిశీలించి మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాల్లో దాదాపు 30 శాతం కోత పూర్తయినా కొనుగోళ్లు చేపట్టకపోవడం దారుణమన్నారు. వాతావరణంలో వస్తున్న మార్పులతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. సిర్రం రాజమల్లయ్య, బట్టు రవి, గుగ్గిళ్ల సాగర్, వెంగళ వెంకటేశ్, లోలపు అభిలాశ్, కైర మధు ఉన్నారు.

ఐక్యతతో బీసీ రిజర్వేషన్లు సాధిద్దాం

ముస్తాబాద్: బీసీ రిజర్వేషన్లను ఐక్యతతో సాధించాలని బీసీ సంక్షేమ సంఘం మాజీ జిల్లా అధ్యక్షుడు, బీసీ జేఏసీ నాయకుడు కొండ యాదగిరి అన్నారు. బీసీ జేఏసీ ఇచ్చిన పిలుపుమేరకు మండలంలో బంద్‌కు అన్నివర్గాల ప్రజలు సహరించాలని కోరారు. విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు సాధించుకునే అవకాశం ఇప్పుడు వచ్చిందన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం జాతీయ కార్యదర్శి ఇదుగురాళ్ల సురేశ్, తోట ధర్మేందర్, పిట్ల విఠల్, శీలం స్వామి, రాంగోపాల్, సత్తయ్యగౌడ్, ప్రశాంత్, రాజేశం, భాను, పల్లెసత్యం, పూస బాలయ్య, యాగన్ల మల్లేశ్, గీస భిక్షపతి, గీస శంకర్, కొంరయ్య, శ్రీనివాస్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు దీపావళి వేడుకలు



వేములవాడ : దీపావళి వేడుకల్లో విద్యార్థులు

వేములవాడ: పట్టణంలోని కృష్ణవేణి గ్రూప్ ఆఫ్ స్కూల్స్‌లో ముందస్తు దీపావళి వేడుకలను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమానికి పాఠశాల డైరెక్టర్ శ్రీసన్నిధి వెంకటకృష్ణ హాజరై విద్యార్థులకు దీపావళి పండుగ ప్రాముఖ్యతను వివరించారు. చిన్నారులు సాంప్రదాయ దుస్తులు ధరించి కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థులు నిర్వహించిన నరకాసుర వధ కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

రైతులకు అవగాహన



దేశాయిపల్లిలో అవగాహన కల్పిస్తున్న ఎంఏవో

బోయినపల్లి: పత్తి రైతులు తమ ఫోన్లలో కపాస్ కిసాన్ యాప్ డౌన్లోడ్ చేసుకోవాలని ఎంఏవో ప్రణీత కోరారు. మండలంలోని తడగొండ, దేశాయిపల్లి, వెంకట్రావుపల్లి తదితర గ్రామాల్లో శుక్రవారం ఏఈవోలు రైతుల సెల్‌ఫోన్ నెంబర్లు అప్‌డేట్ చేశారు. ఎంఏవో మాట్లాడుతూ వానాకాలం సీజన్‌లో పత్తి పంట వేసిన రైతుల వివరాలను ఏఈఓలు రైతు భరోసా పోర్టల్‌లో పంట నమోదు చేశారన్నారు. మండలంలో సుమారు 6,500 ఎకరాల్లో పత్తి పంట సాగు చేశారని, సెల్ నంబర్ మార్చిన రైతులు ఈ నెల 23లోగా ఏఈవోలను సంప్రదించి పోర్టల్‌లో సరిచేసుకోవాలని ఎంఏవో ప్రణీత కోరారు.

చందుర్తి: రైతులు పత్తి పంటను విక్రయించుకునేందుకు కేంద్ర ప్రభుత్వం కపాస్ కిసాన్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిందని, ఈ యాప్‌లో నమోదు చేసుకునే సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు చేస్తారని బండపల్లి ఏఈవో రమ్య అన్నారు. బండపల్లి రైతు వేదికలో కపాస్ కిసాన్ యాప్‌పై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలు గ్రామాల రైతులు, తది తరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తంగళ్లపల్లి: రాళ్లపేట 33కేవీ విద్యుత్ లైన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెస్ ఏఈ మధుకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాళ్లపేట, కస్బెకట్కూర్, తంగళ్లపల్లి, లక్ష్మీపూర్, టెక్స్‌టైల్ పార్కు సబ్‌స్టేషన్‌ల పరిధిలోని అన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉటుందన్నారు.

మట్టి ప్రమిదలనే వినియోగించాలి



రుద్రంగి: పర్యావరణ పరిరక్షణకై మట్టి ప్రమిదలు వినియోగించాలని జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం సమ్మిరెడ్డి, పోటరి మాస్టర్ ఉప్పులూటి వినయ్ అన్నారు. మండలకేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో మట్టి ప్రమిదలు తయారు చేసి, విద్యార్థులకు తయారు చేయు విధానాన్ని పోటరీ మాస్టర్ ఉప్పులూటి వినయ్ వివరించారు.